విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 14, మార్చి 2025

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నేడు నిరసన

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ ఆద్వర్యంలో శుక్రవారం అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో 32 మంది బలిదానానికి గురయ్యారని పేర్కొన్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఉక్కు ఫ్యాక్టరీతో ఎంతో మందికి ఉపాధి లభించిందని, ప్రస్తుత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దారుణ అన్నారు. రాష్ట్ర సిపిఐ సమితి ఉద్యమ పిలుపులో భాగంగా చేపట్టే నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి : కలెక్టర్

**విశాలాంధ్ర-అనంతపురం :** ప్రతి ఒక్క పౌరుడు హెల్మెట్ ధరించి, సీటు బెల్టు వేసుకొని ప్రయాణించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్ లో గురువారం ఉదయం 7:45 గంటల నుండి 8:15 గంటల వరకు నిర్వహించిన ఆకాశవాణి అనంత మిత్ర ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలో రవాణా శాఖ సేవలపై సమస్యలపై నేరుగా ప్రజలకు సూచనలు అందజేశారు. రవాణాశాఖ సేవలపై, సమస్యల పరిష్కారం నిమిత్తమే ఫోన్ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 17 మంది ఫోన్ ద్వారా పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిటిసి వీర్రాజు, ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి కనేకల్‌లో ఆలయ కలశ ప్రతిష్ట ..

**విశాలాంధ్ర, కనేకల్ :** కనేకల్ క్రాసింగ్‌లోని రాయదుర్గం రోడ్డులో నూతనంగా నిర్మించబడిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విశేష పూజలు, హెూమాలు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే సర్వ దేవతల ప్రతిష్ట కార్యక్రమాలు, ఆలయ రాజగోపురానికి కలశ ప్రతిష్ట, కుంభాభిషేకాలు నిర్వహించబడును. అనంతరం ఉదయం 10 గంటలకు భక్తులకు ప్రసాద అన్న సంతర్పణ ఉంటుందన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి..

**విశాలాంధ్ర-రాప్తాడు :** ఏపీ ప్రభుత్వం ద్వారా మండలంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు, బలిజ కులాల మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి అయిన తరువాత కుట్టు మిషన్ పంపిణీ చేస్తామని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 08 వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సంబంధిత సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు అభ్యర్థులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం ధృవీకరణ పత్రం ఉండాలన్నారు. 18 నుండి 50 ఏళ్లలోపు ఉండాలన్నారు. టైలరింగ్ శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా పరిగణనలోకి తీసుకొని కుట్టు మిషను ఇస్తామని వెల్లడించారు.

## ఉపాధి పనులు పరిశీలించిన పీడీ

**విశాలాంధ్ర-శెట్టూరు :** ఉపాధి హామీ పథకం కింద మండలానికి కేటాయించిన లక్ష్యాలు పూర్తిచేయాలని పీడి సలీం భాష సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిధిలో బసంపల్లి, శెట్టూరులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను, గోకులం షెడ్డు, ఆర్టికల్చర్ పండు మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామం నుంచి అధిక మొత్తంలో ఉపాధి కూలీలు పెంచే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఫారంపాండ్, డక్ అవుట్ పాండ్, ప్లాంటేషన్ వర్క్స్, ఆర్టికల్చర్ మినీ గోకులం షెడ్ల నిర్మాణంపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఉపాధి పని కల్పనలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు . కార్యక్రమంలో ఏపీఓ నీరజ, ఈసీ వెంకట రమణ, టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## జై కిసాన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు..

**విశాలాంధ్ర-ఉరవకొండ :** జై కిసాన్ ఫౌండేషన్ చైర్మన్ నాగమల్లి ఓబులేష్, రజిని దంపతుల కొడుకు నాగమల్లి అక్రాంత్ ఋషి, కూతురు నాగమల్లి మనస్వి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఉరవకొండలో ఉచిత చల్లని మినరల్ వాటర్ కేంద్రాన్ని గవి మఠం సంస్థాన ఉత్తరాధికారి కరీ బసవ రాజేంద్ర మహాస్వాములు, ఓం శాంతి కోఆర్డినేటర్ పుష్పక్క, గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్సాహెబ్, సీఐ సీఐ మహానంది, ఎస్సై జనార్దన్ నాయుడు ప్రారంభించారు. వాటర్ కేంద్రం వేసవి కాలం అంతా కొన సాగించనున్నారు. గవి మఠం సంస్థాన ఉత్తరాధికారి కర్రీ బసవ రాజేంద్ర మహా స్వాములు మాట్లాడుతూ ఉరవకొండకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చటం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా సభ్యులు గణేష్ బాబు ఎల్ఐసి గోవిందు, సత్యం కన్వెన్షన్ హాల్ లయన్ సత్యం ఆపద్బంధు ట్రస్ట్ మురళి, వార్డ్ మెంబర్ నిరంజన్ టీచర్ శంకర్, జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు చరణ్, విడపనకల్ రైతులు షాజహాన్, రఘు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల జయంతి

- మొల్లమాంబ రాయలసీమలో పుట్టడం గర్వకారణం
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

**విశాలాంధ్ర -అనంతపురం :** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్‌లో గురువారం అతుకూరి మొల్లమాంబ జయంతి మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కుమ్మరి శాలివాహన వర్గాల నాయకులు, పెద్ద హాజరయ్యారు. జడ్పి చైర్ పర్సన్‌తో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి అతుకూరి మొల్లమాంబ చిత్రపటానికి పూలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అతుకూరి మొల్లమాంబ రాయలసీమలో పుట్టడం తెలుగు భాష కోసం కృషి చేయడం మనందరికీ గర్వకారణం అన్నారు. మన జిల్లా అధికారులకు తెలుగులో లేఖలను పంపాలని, మాట్లాడాలని, పేద ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలుగును ఉపయోగించాలని తరచుగా చెప్పడం జరుగుతున్నదన్నారు. అలాగే ఈ రాష్ట్రానికి ఐఏఎస్ అధికారిగా పనిచేస్తూ దాదాపు ఐదేళ్లు పూర్తయిందని, నేను అర్థం చేసుకున్నది తెలుగు మాట్లాడగలగాలి తెలుగులో మాట్లాడేది అర్థం చేసుకునే విధంగా నేను తెలుగు భాషను నేర్చుకున్నానని, అదేవిధంగా జిల్లా యంత్రాంగానికి తెలుగులోనే మాట్లాడడం తెలుగులోనే సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో నేను పర్యటించేటప్పుడు నా వద్దకు చాలా అర్జీలు వస్తాయని, వాటిలో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉన అర్జీలలో మొదటిగా నేను తెలుగులో రాసిన అర్జీలను ప్రాధాన్యత ఇస్తూ మొదటగా ఎండార్స్మెంట్ చేస్తున్నానన్నారు. ముఖ్యంగా దీని ఉద్దేశం ఏమంటే తెలుగులో రాసిన ప్రజలకు సేవ చేయాల్సిన అవసరం ఉందని భావిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డిఆర్ఓ ఏ. మలోల, సోషల్ వెల్ఫేర్ జెడి రాధిక, కుమ్మర శాలివాహన స్టేట్ ప్రెసిడెంట్ ఓబుళపతి, జిల్లా అధ్యక్షులు రామాం జనేయులు, సంఘం నాయకులు ఓబులేసు, పోతులయ్య వెంకట రమణ, వి.రమణ, భానుకోట రామాంజనేయులు, గోపాల్, వెనుకబడిన తరగతుల సహకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### పద్య భాగంలో ఎనలేని సేవలు..

**విశాలాంధ్ర-గుత్తి** పట్టణం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో గురువారం ఉదయం పెన్షనర్స్ అసోసియేషన్ అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో కుమ్మర మొల్ల 585వ జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మొల్ల చిత్ర పటానికి అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మి నారాయణ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ మొల్ల.. శ్రీ కృష్ణ దేవరాయలు సమయం వారని తెలుసున్నదని.. ఒక నాడు మొల్ల ఆ వూరి దేవ దాసి రంగనాయకి అనే ఆమెను కలవగా, ఆమె మొల్లకు గోదాదేవి విష్ణువుల కల్యాణ గాధను వివరించారని చెప్పారు. అప్పటి నుండి ఆమె దేశ భక్తిలో నిమగ్నము అవుతూ ఉన్నది... మొల్ల రామాయణం ఆరు కాండాలతో, 138 పద్యాలతో ఉన్నది.ఈ కావ్యాన్ని కేవలం ఐదు రోజుల్లో ఆమె రాసిందని ప్రతీతి. ఈమె పూజించే శ్రీ కంట మల్లేశ్వరుని వరం చేతనే కవిత్వం నేర్చుకున్నానని స్వయంగా తెలిపారు అని అదనపు కార్య దర్శి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ లక్ష్మి నారాయణ రెడ్డి, షైక్షా వలి ,నారాయణ రెడ్డి, శామ్యూల్, చెన్నారెడ్డి, గోవిందప్ప, దేవదాసు పాల్గొన్నారు.

## శింగనమల చెరువుకు హంద్రీనీవా నికర జలాలు కేటాయించాలి

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్ప యాదవ్

**విశాలాంధ్ర-శింగనమల :** శింగనమల చెరువుకు హంద్రీనీవా నికర జలాలు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.చిన్నప్పయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శింగనమల సిపిఐ నూతన గ్రామ కమిటీ సమావేశం డి.చిన్నప్పయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శింగనమల రంగరాయుల చెరువు వర్షంనీటిపై అధారపడిందని, జిల్లాలో అతిపెద్ద చెరువు శింగనమల రంగ రాయుల చెరువుకు వరద నీరునీటి కేటాయింపులు ఉన్నాయని చెబుతున్నార ని.. గతంలో వరదనీరు వృథాగా పోయింది కాని శింగనమల చెరువుకు నీరుమాత్రం వదలలేదన్నారు. ఈ చెరువులో నీరు వుంటే చుట్టు ప్రక్కల 20 గ్రామాల బోరుబావులలో ఊట జలాలు పుష్కలంగా ఉండి త్రాగునీరు, సాగునీరుకు ఎటువంటి ఢోకా ఉండదన్నారు. ఈ చెరువు క్రింద వరి పంట పండితే సుదూర ప్రాంతాలనుండి కూలీలు వచ్చి పనులు చేసుకునేవారని, ఆయకట్టుక్రింద దాదాపుగా 90శాతం కౌలురైతులే ఉన్నారని, వారికి రైతులకు అందించే సంక్షేమ ఫలాలన్ని అందించాల అన్నారు. రంగరాయులచెరువుకు ఒక టీయంసి నీటిని కేటాయిస్తే సలకంచెరువు చెరువుకు కుంటలకు నీరు తరలించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే చేనేత కార్మికులు రోజంతా పట్టువస్త్రాలు నేసినా కూలి గిట్టుబాటు కావడం లేదని, నేతన్న నేస్తం సంవత్సరానికి రూ.36 వేలు ప్రతి చేనేత కార్మికునికి అందించాలని, చేనేత కార్మికులకు పెన్సన్ 45 సంవత్సరాల కీ నడలించాలని ముడిసరుకులు సబ్సీడీతో చేనేత కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. నూతన గ్రామకమిటి కార్యదర్శి చితంబరప్ప, సహాయ కార్యదర్శి దస్తగిరి 9మంది కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో మధుయాదవ్, చేనేత మధు, మధురెడ్డి, రవి, షేక్షావలి, భాషా, కళ్యాణ్ పాల్గొన్నారు.

## కూతలేరుపై బ్రిడ్జి నిర్మించండి

### ముఖ్యమంత్రికి మడకశిర, శింగనమల ఎమ్మెల్యేలు వినతి

**విశాలాంధ్ర-శింగనమల :** మండల పరిధిలోని అలంక రాయునిపేట గ్రామంలో, కూతలేరుపై బ్రిడ్జి నిర్మించాలని మడకశిర ఎమ్మెల్యే టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్. రాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సచివాలయంలో మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి వినతి పత్రం అందించారు. అలంకరాయునిపేట గ్రామస్తులు వర్షా కాలంలో కూతలేరు పొంగిన పొర్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే కూతలేరు పొంగిన సమయంలో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, తక్షణమే కూతలేరు పై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిసి వంకపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఉమ్మడిగా వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో పోతలేరు పొంగినప్పుడు విద్యార్థులు , రైతులు, రైతు కూలీల అవస్థలు అన్నీకావని ఆయనకు వివరించారు. ఏళ్ల తరబడి అలంకరాయునిపేట గ్రామస్తులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు

**విశాలాంధ్ర. గుత్తి** పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మూడు పరీక్ష కేంద్రాల్లో గురువారం సజావుగా ముగిశాయి. చివరి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష విద్యార్థులను అధికారులు, పోలీసు సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతించారు.

కెమిస్ట్రీ పేపర్ 1, కామర్స్ పేపర్ 1, సోషియాలజీ పేపర్ 1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్ 1 పరీక్షలు రాసిన విద్యార్థులు ఉత్సాహంతో బయటకి వచ్చారు. స్నేహితులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఇంటికి వెళ్తామన్న సంతో షంలో హాస్టల్ విద్యార్థులు కేరింతలు కొట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం నెలకొంది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

## చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

**విశాలాంధ్ర-ఉరవకొండ :** సమాజంలో ప్రతి మహిళ చట్టాలపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలని ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ డి.దుర్గా కళ్యాణి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మహిళలు చిన్నారులు కు ప్రత్యేకంగా చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఒకసారి చట్టం ద్వారా బాలికలు చిన్నారులు మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలకు ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించేందుకు ఫోక్సో చట్టం ఉందన్నారు. వీటిపై ప్రజలలో విస్తృతంగా అవ గాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఉరవకొండ ఎంపీడీవో రవిప్రసాద్, సిడిపిఓ శ్రీదేవి, ఎస్సై జనార్ధన్ నాయుడు మరియు గ్రామ సచివాలయం, పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ, అంగన్వాడి శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలను అమ్మిన శ్రావణి సీడ్స్ లైసెన్సును రద్దు చేయాలి

- ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు మురళికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి
- మురళిని పరామర్శించిన ఏపీ రైతు సంఘం నాయకులు

**విశాలాంధ్ర-అనంతపురం :** కల్తీ విత్తనాలను అమ్మిన శ్రావణి సీడ్స్ లైసెన్సను రద్దు చేయాలని, ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు మురళికి రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు అనంత జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సత్యసాయి జిల్లా ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బత్తలపల్లి మండలం డి.చర్లపల్లి గ్రామా నికి చెందిన రైతు మురళి బుధవారం ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా ఏపీ రైతు సంఘం నాయకులు ఆయన్ను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతు మురళి తనకు ఉన్న మూడు ఎకరాలతో మరో ఎకరం గుత్తకు తీసుకొని నాలుగు ఎకరాలు శ్రావణి సీడ్స్ వారితో కలింగర విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగుచేశాడన్నారు. పంటకు రూ. 6 నుంచి 8 లక్షలు ఖర్చుతో పాటు కుటుంబం మొత్తం పనిచేసింది. పైరు బాగా పెరిగిన పెరిగిన కాయ సక్రమంగా రాకపోవడంతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. దీంతో లక్షలాది రూపాయలు నష్టపోయాయని బాధితుడు శ్రావణి సీడ్స్ వారి దగ్గరకు పోయి మీరిచ్చిన విత్తనాలు నాశరకంగా ఉండటం వల్ల నేను లక్షల రూపాయలు నష్టపోయానని న్యాయం చేయాలని కోరగా ఏ విధమైన నష్టపరిహారం ఇవ్వనని ఎవరికి దగ్గరకైనా పోయి చెప్పుకో బెదిరించాడన్నారు. దీనితో రైతు మురళి దిక్కు తోచక ఆత్మాభిమానంతో షాపు ముందు ఆత్మహత్యకు ప్రయత్నించాడన్నారు. అధికారులు వెంటనే శ్రావణి సీడ్స్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కార్యదర్శి ముత్యాలప్ప కనగానపల్లి మండల అధ్యక్షులు అంకె ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ నుండి మల్లికార్జున బహిష్కరణ..

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:** జిల్లా ఏఐటీయూసీ నుండి ఆటో యూనియన్ నాయకుడైన మల్లికార్జున్ని బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం సాయంత్రం జరిగిన ఏఐటీయూసీ ఆఫీసు బేరర్ల సమావేశంలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో మల్లికార్జునకు ఏఐటీయూసీకి, ఆటో యూనియన్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. అదేవిధంగా భవనిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు రాష్ట్ర నాయ కత్వానికి తన రాజీనామాను సమర్పించారని రాష్ట్ర నాయకత్వం సూచనలు మేరకు ఆమోదించినట్లు తెలిపారు.

## ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

**విశాలాంధ్ర-గార్లదిన్నె :** స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపిసి, ఎంఈసీ, సీఈసీ, గ్రూపులో మొదటి సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదవ తరగతి చదువుతున్న వారు అయి ఉండాలి.. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200లు, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రూ.150లని తెలిపారు. దరఖాస్తు రుసుమును ఈ నెల 17 వ తేదీ నుండి మే 22 వరకు నెట్ బ్యాంకింగ్ క్రెడిట్ లేక డెబిట్ కార్డు ద్వారా చెల్లించవచ్చు అని ఆన్లైన్లో దరఖాస్తు ఫారం పూరించాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్ లో వివరాల కొరకు సంప్రదించాలని సూచించారు.

## అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయండి

**విశాలాంధ్ర- తాడిపత్రి :** అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలని రాష్ట్ర దివ్యాంగ నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు, అడ్వకేట్ కె.వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారము పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలోని సూపెండెంట్ డేవిడ్ ను రాష్ట్ర దివ్యాంగుల నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసి దివ్యాంగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పెన్షన్ వెరిఫికేషన్ జరుగుతోంది. ఈ పెన్షన్ వెరిఫికేషన్లో బోగస్ దివ్యాంగ మెడికల్ సర్టిఫికెట్ పొంది పెన్షన్ తీసుకుంటూ లబ్ధి పొందుతున్న వారిని గుర్తించి వారి దివ్యాంగ మెడికల్ సర్టిఫికెట్లను రద్దు చేయాలన్నారు. అలాగే అర్హులైన దివ్యాంగులను గుర్తించి వారికి మెడికల్ సర్టిఫికెట్లు అందజేసి పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరిండెంట్ డేవిడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు.

## పంచాయతీ అధికారులు, సర్పంచ్ భర్త కుమ్మకు...

- పంచాయతీ నిధులు గుటుక్కు
- మూడేళ్లుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్న వాటర్ మ్యాన్

**విశాలాంధ్ర, గుంతకల్ :** పంచాయతీ అధికారులు సర్పంచ్ భర్త కుమ్మక్కై వాటర్ మెన్‌కు చెల్లించవలసిన బిల్లులు గుటుక్కు మనిపించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు గత మూడు సంవత్సరాలుగా వాటర్ మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నానని మొదట్లో పదివేల రూపాయలు మాత్రమే ఇచ్చారని ఇప్పటివరకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, దీంతో కుటుంబ పోషణ దయానియంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు జీతాలు ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శి ని సర్పంచిని పలుమార్లు బ్రతిమిలాడిన బిల్లులు రాలేదని చేతులెత్తేస్తున్నారు. నేను విధుల్లోకి చేరినప్పుడు నుండి లక్షన్నర పైన బకాయి రావాలని విశాలాంధ్ర ఎదుల బాధ వెల్లగక్కాడు. ఈ విషయమై విశాలాంధ్ర విలేఖరి పూర్తిస్థాయిలో విచారించగా అసలు విషయం బయటపడింది.. గత ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు రాలేదంటూ ఊడిగం చేయించుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిధులు పుష్కలంగా ఉన్నాయి పారిశుద్ధ్య, తాగునీరు విద్యుత్ దీపాలు తదితరుల వాటికి సర్పంచులు నిధులు ఖర్చు చేస్తున్నారు. అయితే దోసలోడికి గ్రామంలో గత నెల 27వ తేదీ వాటర్ మాన్ శాలరీ, ఎలక్ట్రికల్ బిల్లు పేరుతో రూ.62000 వేలు.. పంచాయతీ నిధులు విత్‌డ్రా చేశారు.. ఇందులో కొసమెరుపు ఏమిటంటే వాటర్ మాన్ పేరుమీద బిల్లు చేయకుండా సర్పంచ్ భర్త పేరు మీదగా విత్ డ్రా అయినది కానీ వాటర్ మాన్‌కి చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు.. ఉన్నత అధికారులు పంచాయతీ అధికారుల పైన చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

## ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించొద్దు

- సంతోషకర వాతావరణంలో హెూళి జరుపుకోండి
- యువతకు ఎస్పీ జగదీష్ సూచన

**విశాలాంధ్ర-అనంతపురం క్రైం :** అనంతపురం జిల్లా ప్రజలందరికీ ఎస్పీ పి.జగదీష్ హెూళీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హెూళి పండగ జరుపుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకుండా... ఇబ్బంది కలిగించకుండా పండుగ జరుపుకోవాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలు, ప్రదేశాలు, కాలనీలు, రహదారులపై సిసి కెమేరాలు ఉండటంతో పాటు డ్రోన్లు కూడా వినియోగిస్తున్నామని తెలియజేశారు. కించపరిచేలా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం.. లేదా ఏవేని సమస్యలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి పర్వదినాల సందర్భంగా ముఖ్యంగా యువత ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రమాదాలకు దూరంగా ఉండాలి, ద్విచక్ర వాహనాలపై వేగంగా, సైలెన్సర్లు తొలగించి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్ళరాదన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవం జరుపుకోవాలన్నారు. సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు . పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పి విజ్ఞప్తి చేశారు.

## పోలీసులను సన్మానించిన గ్రామస్థులు

**విశాలాంధ్ర-కనేకల్ :** కనుకల్ మండల పరిధిలో ఉన్న సొల్లాపురం గ్రామస్తులందరూ కలిసి కనేకల్ పోలీసులను సన్మానించారు. కొన్ని రోజుల క్రితం సొల్లాపురం గ్రామంలో హౌస్ బ్రేకింగ్ న్యూస్, దొంగతనం జరిగిన సంగతి అందరికీ తెలిసిందే, శ్రీ సీతారాముల దేవాలయం కోసం గ్రామస్తులందరూ కలిసిపోగు చేసిన సొమ్మును ఇంటిలో భద్రపరచగా అంతర్రాష్ట్ర దొంగలు ఆ ఇంటిలో దూరి ఆ సోమ్ముతో పరారయ్యారు, కొన్ని రోజుల తర్వాత పోలీసులు ఈ హౌస్ బ్రేకింగ్ చోరీ కేసును ఛేదించి ఆ దొంగలను పట్టుకున్నారు, దొంగల నుంచి ఆ సొమ్మును రికవరీ చేసి గ్రామస్తులను పిలిపించి దేవుని సొమ్ము వివరాలు తెలుసుకుని వారికి అప్పగించారు. సంతోషంలో గ్రామస్తులు కనేకల్ పోలీసులకు శాలువాలు కప్పి అభిమానాన్ని చాటుకున్నారు.

## పి-4 సర్వే వేగవంతం చేయాలి

**విశాలాంధ్ర-బొమ్మనహాల్ :** గ్రామాల్లో జరుగుతున్న పి-4 సర్వే పక్కగా నమోదు చేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు. ఉద్దేహాల్ గ్రామ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడారు. నిర్లక్ష్యం చేయకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇచ్చిన వ్యవధిలోని పూర్తి చేయాలని చెప్పారు. రెండు మూడు రోజుల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. పీ-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చడానికి, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది నిరుపేదలను గుర్తించాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్, పంచాయతీ కార్యదర్శి శివన్న, వీఆర్వో యుగంధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకర్లతో తాగునీటి సరఫరా..

**విశాలాంధ్ర-యాడికి:** మండల పరిధిలోని పిన్నేపల్లిలో గురువారం వైసిపి మండల కన్వీనర్ సంజీవ రాయుడు తన సొంత ఖర్చులతో తాగునీటి సరఫరా చేశారు. గత కొద్దిరోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు ట్యాంకర్‌తో నీళ్ల సరఫరా చేసే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీటిని వృథా చేయరాదని, వరుస క్రమంలో బిందెలు పట్టుకుని అందరికీ సహకరించాలని సంజీవ రాయుడు ఆయా కాలనీ వాసులకు తెలియజేశారు. తాగు నీటిని అందించిన సంజీవ రాయుడుకి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అగ్గి రాముడు, సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సూర్యనారాయణ, వైసీపీ నాయకులు మురళి, శ్రీరాములు, శ్రీకాంత్, శివ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలు

**విశాలాంధ్ర-రాప్తాడు :** తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయడం వల్ల భవిష్యత్తులో అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ అన్నారు. గురువారం రాప్తాడు కేజీబీవీలో విద్యార్థినులకు బాల్య వివాహ నిరోధక చట్టం 2006, టీనేజ్ గర్భం వల్ల జరిగే నష్టాలను, పి.సి.పి.ఎన్.డి.టి-1994 చట్టం (గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం 1994)పై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో మూఢనమ్మకాలతో, ఇతర కారణాలతో ఆడపిల్లలకి చిన్న వయసులో వివాహాలు చేస్తున్నారని. టీనేజ్‌లో గర్భం వల్ల రక్తహీనత, అధిక రక్త పీడనం, సంక్లిష్ట కాన్పుకు దారితీసి మాతా శిశు మరణాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ముత్యాలమ్మ, హెల్త్ సూపర్వైజర్ అరుణమ్మ, నారాయణస్వామి పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 14, మార్చి 2025


# యోగివేమన రిజర్వాయర్‌కు హంద్రీనీవా నీరు అందించాలి

## చెరువులకు తూములు ఏర్పాటు చేయాలి

## ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్

**విశాలాంధ్ర-ముదిగుబ్బ:** ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్‌తో పాటు చెరువులకు హంద్రీనీవా నీరు అందే విధంగా అధికారులు చూడాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. ముదిగుబ్బ మండలలోని హంద్రీనీవా కాలువతో పాటు పలు గ్రామాల్లో చెరువులను శ్రీరామ్ పరిశీలించారు. పాముదుర్తి వద్ద జిలేడు బండ వంక, యోగి వేమన రిజర్వాయర్, ముదిగుబ్బ సమీపంలో హంద్రీనీవా కాలువ టన్నెల్ ను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేస్తే.. తాము తీవ్రంగా నష్టపోతామని శ్రీరామ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికీ ఇందుకు సంబంధించి జలవనరులశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ప్రాంత రైతులు నష్టపోకుండా కాలువకు తూములు ఏర్పాటు చేసి.. చెరువులకు నీరందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనిపై హంద్రీనీవా ఎస్ఈతో కూడా శ్రీరామ్ మాట్లాడారు. ముదిగుబ్బ మండలంలోని చెరువులు, యోగి వేమన రిజర్వాయర్ కు నీరు అందించే విధంగా చూడాలని కోరారు. కచ్చితంగా ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. లైనింగ్ వలన రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని శ్రీరామ్ కోరారు. తూములు ద్వారా వంకలు, కాల్వలకు నీరు వదిలితే భూగర్భజలాలకు ఇబ్బంది ఉండదు.. చెరువులు నిండటం వలన ఆయకట్టుకు పూర్తిగా నీరందుతుందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా నీరందిస్తామని జలవనరుల శాఖ మంత్రి నుంచి హామీ వచ్చిందని శ్రీరామ్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం నాయకులు రమేష్ బాబు, మండల కన్వీనర్ కర్ణం ప్రభాకర్ నాయుడు, కోట్ల బాబి,సోమల వినోద్ బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంఘం కనగానపల్లి మండల కమిటీ ఎన్నిక ..

**విశాలాంధ్ర-కనగానపల్లి:** గ్రామంలో ఓబులేసుని గుడి సన్నిధి గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతులతో సమావేశంలో రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నగిరి కాటమయ్య రైతు సమస్యలపై మాట్లాడుతూ రైతు గిట్టుబాటు ధరలు డాక్టర్ స్వామినేతను సిఫార్సుల అమలు రైతులకు. రుణ మాఫీలు రైతుల పెట్టిన పంటలో చేతికి రాక అనేక రకాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుకు మొత్తం ఒకేసారి రుణమాఫీ చేయాలని హంద్రీ నీవా కాలువను లైనింగ్ పనులు ఆపి... కాలువ వెడల్పు చేసి రైతులకు ఆయకట్టుకు మీరు విడుదల చేయాలని, అన్నదాత సుఖీభవ ఇన్పుట్ సబ్సిడీ రైతాంగసమస్యలపై అన్నగిరి కాటమయ్య మాట్లాడారు. రైతు సంఘం కనగానపల్లి మండల అధ్యక్షునిగా మామిళ్ళపల్లి గ్రామానికి. చెందిన అంకె ఆదినారాయణను పార్టీ కండువా కప్పి పార్టీ సభ్యత్వం ఇస్తూ రైతు సంఘం తరపున రైతులకు అండగా ఉండాలని రైతాంగ సమస్యలపై పోరాడాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశిం చారు. మామిళ్ళపల్లి అంకె ఆది నారాయణ మాట్లాడుతూ నన్ను నమ్మి కనగానపల్లి మండల రైతు సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నగిరి కాటమయ్యకి, సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్యకి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహదేవ్‌కి, రైతు సంఘం ఉపాధ్య క్షులు వడ్ల గోవిందుకి, జిల్లా కౌన్సిల్ మెంబర్ రాంపురం రామాంజనేయులుకి, రైతు సంఘం మండల కమిటీకి ఎల్లవేళలా అందుబాటులో ఉండి రైతాంగ సమస్యలపై పోరాడుతానని తెలిపారు.

.కనగానపల్లి మండల రైతు సంఘం గౌరవ అధ్యక్షులుగా జింకల మాదన్న, రైతు సంఘం మండలాధ్యక్షులు అంకె ఆది నారాయణ, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి పసుల నాగరాజు, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అంకె నగేష్, మండల రైతు సంఘం ఉపాధ్యక్షులు గవ్వల ప్రసాద్ బద్దలాపురం వి శ్రీరాములు, సహాయ కార్యదర్శులుగా ఎస్ రాజేంద్ర పామాల రాము ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# అనారోగ్యంతో రైలు కింద పడి లారీ క్లీనర్ సేక్షావలి మృతి

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసముంటున్న తండ్రి అబ్దుల్ ఖాదర్ వలీ కుమారుడు షేక్షావలి(24) గురువారం తెల్లవారుజామున ఓ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, హిందూపురం జీఆర్పి హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలు... తండ్రి కోళ్ల ఫారం వ్యాపారం చేసుకుంటూ, మృతుడు ఓ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. నాలుగేళ్లుగా మృతుడు సేక్షావలికి అల్సరు,... గడ్డలు ఉండడం తో తీవ్ర నొప్పితో బాధ పడుతుండేవాడు. తల్లిదండ్రులు అనంతపురం, బెంగళూరు తదితర హాస్పిటల్లో వైద్య చికిత్సలు అందించినా కూడా జబ్బు నయం కాలేదు. దీంతో వారం రోజులుగా తాను రైలు కిందపడి చనిపోతాను అని ఎల్లప్పుడూ తల్లిదండ్రులకు తెలిపేవాడు. అంతేకాకుండా మృతునికి మద్యం అలవాటు కూడా ఉంది. జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారు జామున ఓ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఒక అక్క కూడా ఉందని, వివాహం కాలేదు. నాందేడ్ ఎక్స్ప్రెస్ లోకో పైలట్ రైలు పట్టాల కింద పడిన శవాన్ని చూసి హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న హిందూపురం జీఆర్‌పి రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తదుపరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించండి

**విశాలాంధ్ర-బుక్కపట్నం :** ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని, వేసవి కాలంలో కనీసం నీటి సదుపాయం లేకపోవడం ఎండలోనే పనులు చేస్తూ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేవలం ఫారం పాండ్ పనులు మాత్రమే ఉండడంతో కూలీలు పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని గమనించారు. బిల్లులు పడకపోవడం, పనులు చేస్తున్న ప్రదేశం కొండ ప్రాంతం, గుండ్లు రాళ్లు ఉండడంతో పాటు నీటి సదుపాయం కూడా సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సరైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు సహకరిస్తే సహించం

## - సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ముసుగు మధు

**విశాలాంధ్ర-ధర్మవరం :** ధర్మవరం పట్టణంలో నకిలీ ప్లంబర్స్‌కు యూనియన్ మాటున భూ దోపిడీకి పాల్పడిన వ్యక్తులను కాపాడుతూ వారి అక్రమ నిర్మాణాలకు లోపాయి కారీగా సహకరిస్తే సహించే ప్రసక్తి ఉండదని ధర్మవరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ పట్టణంలోని 650 - 2 సర్వే నంబర్లు ప్లంబర్ యూనియన్ పేరు చెప్పుకొని ముగ్గురు వ్యక్తులు కుటుంబ సభ్యుల పేరిట కోట్లాది రూపాయల విలువైన భూములను దోచేసిన సంగతి తెలిసిందే. దీనిపై సిపిఐ నాయకులు ఆర్డీవో కార్యాలయాన్ని దిబ్బంధం చేయగా సదరు భూమిలో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు విచారించి అర్హులైన పేదలకు అందేలా చూస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. తాసిల్దార్ హామీలు సైతం ఖాతరు చేస్తూ యూనియన్ నాయకులు నిర్మాణాలు కొనసాగిస్తుండడంపై సిపిఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తహసీల్దార్‌ను కలిసి జరుగుతున్న తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు చెప్పిన నిర్మాణాలు కొనసాగిస్తున్నారంటే మీ మధ్య లోపాయి కారి ఒప్పందం కుదిరినట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఆక్రమించిన ప్లాట్లు ఇంటి నిర్మాణాలు ఆపకపోతే శుక్రవారం ఉదయం తహసిల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక్కడ జరుగుతున్న తథంగం చూస్తుంటే అక్రమార్కులకు అండదండ లభించడం వెనక భారీ ఎత్తున ముడుపులు మారాయని వారు ఆరోపించారు. అక్రమార్కులను గుర్తించి వారి పైన కేసులు పెట్టేవరకు వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని వారు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవి, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, వెంకట స్వామి, ప్లంబర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గోవింద రాజులు, లక్ష్మీనారాయణ, అఖిలభారత యువజన సమైక్య సకల రాజా తదితరులు పాల్గొన్నారు.

# పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలి

## సిపిఐ మండల కార్యదర్శి చెల్లా శ్రీనివాసులు

**విశాలాంధ్ర-ముదిగుబ్బ :** పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి ఒక్కరికీ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను మంజూరు చేయాలని సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రైతన్నలకు సంబంధించి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో భాగం గా ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య మంజూరు ప్రక్రియను రెండు నెలలు నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే అన్నారు, కాగా వ్యవసాయ అధికారులు పిఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులకు మాత్రమే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను మంజూరు చేస్తుండడంతో మిగిలిన రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆరోపించారు, మండల వ్యాప్తంగా సుమారు 18 వేల మంది రైతులు ఉండగా వారిలో కేవలం పిఎం కిసాన్ పథకానికి అర్హులైన 15200 మంది రైతులకు మాత్రమే రైతు గుర్తింపు నెంబరు కేటాయింపు ప్రక్రియ చేస్తు మిగిలిన రైతులను విస్మరిం చడం బాధాకరం అన్నారు, ముఖ్యంగా కొన్ని సంవత్సరాల కిందట చేర్పులు మార్పులు జరిగిన డీ పట్టా భూములకు సంబంధించిన రైతులను, రీ సర్వే జరగని భూములకు చెందిన రైతులకు సాంకేతిక కారణంతో విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయడానికి ఆటంకం ఏర్పడుతోందని వ్యవసాయ అధికారులు చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, నెట్వర్క్ సమస్య తదితర కారణాలతో నేటికీ మండల వ్యాప్తంగా ఇంకా 40 శాతం మంది రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ పూర్తి కాలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నా యని తెలిపారు. నత్తనడక సాగుతున్న దృష్ట్యా రైతు భరోసా కింద మంజూరు చేసే 20 వేలను ఈ రైతు గుర్తింపు సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి రైతుకు అందజేయాలన్నారు.

# ఘనంగా మొల్ల జయంతి వేడుకలు

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆతుకూరి మొల్ల జయంతి వేడుకలను కుమ్మర కులస్తుల అధ్యక్షులు రాఘవేంద్ర ప్రజాపతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ధర్మవరం నియోజకవర్గ ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు, కుమ్మర కుల బాంధవులు చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ధర్మవరంలో కులబాంధవుల సమక్షంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, గొప్ప తెలుగు కవయిత్రి, సాధువు మొల్లమాంబాను గౌరవించడం జరుగు తోందని తెలిపారు. వారు కవయిత్రి గానే కాకుండా పురుషుల ఆధిపత్యములో ఉన్న కాలంలో అడ్డంకులను ఛేదించిన గొప్ప మహిళగా కూడా ఒక మార్గదర్శకురాలు అని కొనియాడారు. అంతేకాకుండా ఆమె ప్రజల భాష తెలుగులో రాయడానికి ఎంచుకొని అత్యంత ప్రసిద్ధి రచన మొల్ల రామాయణం, రాముడి కథను సరళంగా ఆధ్యాత్మిక పద్ధతిలో వివరించే ఒక కళాఖండము అని తెలిపారు. ఆమె రచనలు తరతరాలకు స్ఫూర్తిని ఇస్తూనే ఉన్నాయని, భక్తి, జ్ఞానం, పట్టుదల, ఏ అడ్డంకినైనా అధిగమించగలరని అవి మనకు బోధిస్తున్నాయని తెలిపారు. ఆమె చేసినట్లుగా విద్య, జ్ఞానాన్ని అందరికీ అందుబాటులో తీసుకురావడానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొల్ల కుమ్మరి కులంలో పుట్టడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మర కుల సంఘం ఉపాధ్యక్షులు మహేశ్ ప్రజాపతి, కార్యదర్శి రంగనాథ్, ప్రచార కార్యదర్శి రాప్తాడు దామోదర, కోశాధికారి కానీండ్ల రాజు, కుమ్మర కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అవినీతి ఆరోపణలపై చర్యలేవి?

## కప్పిపుచ్చుతున్న ఏఈ !

**విశాలాంధ్ర-నంబులపూలకుంట:** వారం రోజులుగా మండల విద్యుత్ శాఖలో అవినీతి ఆరోపణలు వస్తున్నా విచారించకుండా మండల ఏఈ సాలేహ బాషా నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్‌మెన్ (గ్రేడ్ 2) కొత్త విద్యుత్ కనెక్షన్ కొరకు వచ్చిన వినియోగదారుల నుండి అధిక మొత్తంలో రుసుము వసూలు చేసి,లక్షల్లో అక్రమ సంపాదన గడించారని , అతనిపై చర్యలు తీసుకోవాలని అదే శాఖకు చెందిన లైన్ మెన్ మండల ఏఈకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఏఈ పాత్రపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఉద్యోగిపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా కూడా విని విన్నట్లు వ్యవహరించారని, ఈ తతంగం అంతా ఏఈ కనుసన్నల్లో జరిగిఉంటుందని ప్రజలుచర్చించుకుంటున్నారు. వచ్చిన ఆరోపణలపై తప్పులు జరిగివుంటే సరిదిద్దుతామని సోషల్ మీడియాలో బుధవారం ఒక వీడియో ఏఈ సాలేహ బాషా విడుదల చేశారు. కానీ అవినీతి ఆరోపణలపై ఏ మాటా మాట్లాడక పోవడంతో చర్చనీయాశం అయింది. పై అధికారులు విచారణకు వస్తే తమ బాగోతం బయట పడుతుందనే భయంతో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టి అవినీతిని నిగ్గు తేల్చాలని మండల ప్రజలు కోరుచున్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

## సిపిఐ తాలూకా కార్యదర్శి ఆర్ జి పవిత్ర

**విశాలాంధ్ర-మడకశిర:** పట్టణ ప్రాంతంలో నిరంతరం జరుగుతున్న ప్రమాదాలకు నివారణ చర్యలు చేపట్టాలని సిపిఐ తాలూకా కార్యదర్శి ఆర్.జి. పవిత్ర డిమాండ్ చేశారు.స్థానిక పట్టణ పరిధిలో గురువారం ఆగి ఉన్న బైకును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంపై పవిత్ర ఆవేదన వ్యక్తం చేశారు.బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని ప్రతినిత్యం ఈ బస్సుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో డ్రైవర్ల తీరు మారడం లేదని, నిర్లక్ష్యంగానే డ్రైవింగ్ చేస్తూ అభం శుభం తెలియని, అమాయకులను ప్రమాదాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు.

# మోడల్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని గుట్ట కింద పల్లి లో గల ఏపీ మోడల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. గురువారం మాట్లాడుతూ మా కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సీసీ, ఎంఈసి గ్రూపులు కలవని, ప్రతి గ్రూపునకు 40 సీట్లు ఉంటాయని, ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టి వారికి 150 రూపాయలు, ఓసి, బీసీ వారికి 200 ఉంటుందని తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కలదని తెలిపారు. ఉచిత విద్యతో పాటు కళాశాలలో బోధన మధ్యమం ఆంగ్లంలో ఉంటుందని తెలిపారు. విద్య అభ్యసించుటకు ఎటువంటి ఫీజులు ఉండవని, జిల్లాలో ప్రభుత్వం లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తీర్ణతలైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదవ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు ఇవ్వబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 7981171568కు గాని 7799004659కు గాని 6305974274 కు గాని సంప్రదించాలని తెలిపారు.

# మాల కులస్తులకు రక్షణ కల్పించండి

**విశాలాంధ్ర-ధర్మవరం :** మాల కులస్తులకు రక్షణ కల్పించాలని ఏలుకుంట్ల గ్రామ మాల కులస్తులు గురువారం ఎమ్మార్వో కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం డివిఎంసి మెంబర్ రామన్న, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, అనంతపురం జిల్లా అధ్యక్షులు దళిత రత్నమాల ఓబులేసు మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా సర్వే నెంబర్ 94 విస్తీర్ణం 0.86 సెంట్లు వంక పోరంబోకు లో గల ఎస్సీ కులస్తులకు చెందిన స్మశాన వాటిక సర్వే చేయించి హద్దులు ఏర్పరిచి పక్కన ఉన్న అమర నారాయణ వారి తండ్రి లేటు గంగన్న కుమారుడు రామానాయుడు తండ్రి అమరనారాయణ నుంచి మాకు రక్షణ కల్పించాలని తెలిపారు. 30 సంవత్సరాల తర్వాత నిజగుణం సమాధిని తొలగించి అమరనాయుడు 0.56 సెంట్లు స్థలాన్ని వ్యవసాయ భూమిగా మార్చుకొని ఆక్రమించుకున్నారన్నారు. బుక్కపట్నం సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రికార్డులలో వంక పోరంబోకుగా ఉన్నదని, 2025 వరకు ఇంకా పోరంబోకులోనే ఉన్నది అని తెలిపారు. మా స్థలములో భూమిలో ఖననం చేయరాదని అమరనారాయణ మమ్ములను అడ్డగించారన్నారు. జూన్‌లో ప్రజా సమస్య పరిష్కార వేదిక జిల్లా కలెక్టర్‌ను కలువగా, తహసీల్దార్‌ను, ఆర్డీఓను కలవమని చెప్పారన్నారు. తదుపరి అమరనారాయణ వారి కుమారుడు రామానాయుడు హద్దులను రాళ్లను తొలగించారని, మాకు న్యాయం చేసేందుకు అధికారులు వారిని పిలిచినా కూడా వారు రాలేదని, మాతో తెల్ల కాగితాలలో సంతకాలు చేయించుకుని పంపారన్నారు. బోరంబోకులో గల స్థలాన్ని శాశ్వతంగా మాల కులస్తులకు స్మశాన వాటిక నిమిత్తం హద్దులు ఏర్పర్చి అప్పగించాలని కోరారు.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి బయలుదేరిన నాయకులు

**విశాలాంధ్ర-ధర్మవరం:** జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవానికి హిందూపురం పార్లమెంటు నుండి వందలాది మంది అభిమానులు కార్యకర్తలు వాహనాలలో బయలు దేరి వెళ్లారు. వాహనాలకు జనసేన పార్టీ నాయకులు జెండాలు ఊపి ఘనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగు తుండగా హిందూపురం పార్లమెంటు స్థాయిలో కూడా కార్యకర్తలు అభిమానులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు.

# ఏపీ బీసీ సంఘం మహిళ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా సహకారపు జయశ్రీ ఎంపిక

**విశాలాంధ్ర-ధర్మవరం:** ఇటీవల మంగళగిరిలో రాష్ట్ర బీసీ సంఘం సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ సభలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన సంకారపు జయశ్రీని ఏపీ బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీసీ సంఘం నాయకులు జయశ్రీను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాకు బీసీ సంఘం మహిళ రాష్ట్ర అధ్యక్షురాలుగా ఇచ్చిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘం మహిళ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. నేడు మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నా వివక్షతకు గురికావడం చాలా బాధాకరమని తెలిపారు. మహిళలతో పాటు బాలికలు, చిన్నారులు, విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం అరాచకాలు చేయడం దాడులు చేయడం రేపులు చేయడం, తదుపరి దారుణంగా హత్య చేయడం, యాసిడ్ చేయడం లాంటివి నేడు రాష్ట్రంలో అధికమయ్యాయని, వీటన్నింటిని మహిళలందరూ ధైర్యంగా ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం కూడా ఇటువంటి సంఘటనలు జరగకుండా చట్టాన్ని మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో 60 శాతం బీసీలు ఉన్నారని, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీ సంఘమునకు చేయూత మరింత ఇవ్వాలని తెలిపారు. ఒక మహిళను ఆట వస్తువుగా, అశ్లీలంగా చూడడం దారుణమన్నారు. కళాశాలలో విద్యార్థినీలను ప్రేమ పేరుతో దాడులు చేసి, చంపడం ఘోరాతి ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు చేసే వారి పైన ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వారు కోరారు. అదేవిధంగా బీసీ సంఘములో ఉంటూ ఎదిగిన వారికి రాజకీయాలలో సముచిత స్థానాన్ని కల్పించాలని తెలిపారు.

# కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

**విశాలాంధ్ర,అమరాపురం :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకల సందర్భంగా ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆరాధ్య, ఈఓఆర్డి నాగముని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కవిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కడప జిల్లాలో జన్మించిన ఆమె మల్ల రామాయణం తదితర అనేక రచనలను చేసి ప్రఖ్యాతిగాం చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జాతీయ ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యక్తి ఆత్మహత్య

**విశాలాంధ్ర-పెనుకొండ:** నగర పంచాయతీలోని 2వ వార్డు వెంకటరెడ్డి పల్లి గ్రామంలో నంజుండ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు భార్య, రమేష్ అనే వ్యక్తులు ప్రోద్బలంతోనే నా కొడుకు చనిపోయాడని, ఫిర్యాదు ఇవ్వగా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఇంటింటికీ 104 వైద్య సేవలు ..

**విశాలాంధ్ర-ఓడిసి రూరల్ :** ఇంటింటికి 104 వైద్య సేవలు కార్యక్రమం ద్వారా గౌరపురం గ్రామంలో గురువారం ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ కమల్ రోహిత్ తెలియజేశారు. బిపి, షుగర్,ఆస్తమాతో పాటు గర్భవతులు,బాలింతలు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి వసుంధర, 104 డేటా ఎంట్రీ చంద్ర, ఆరోగ్య కార్యకర్త అశ్విని, డ్రైవర్ జయచంద్ర పాల్గొన్నారు.

# లేపాక్షి ఆలయ ప్రాముఖ్యతపై సిఎంకు నివేదిక అందజేసిన చరిత్రాకారుడు

**విశాలాంధ్ర-లేపాక్షి :** లేపాక్షి వీరభద్రాలయంకు ఐక్యరాజ్యసమితి వారి యునెస్కో వారసత్వ కట్టడాల జాబితాలో శాశ్వతంగా చోటు సంపాదించడానికి అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయని తెలుపుతూ ప్రాథమిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అందజేసానని పర్యాటక నిపుణుడు, చారిత్రకారుడు మైనాస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం ద్వారా ప్యారిస్లోని యునెస్కోతో సంప్రదింపులు జరుపడానికి వెంటనే ఒక నిపుణుల సంఘాన్ని నియమించాలని విజ్ఞప్తి చేసారు. ఆసియాలోనే అతి పెద్దదైనా వీరభద్రస్వామి తైల వర్ణ చిత్రం, ప్రపంచంలోనే అతి పెద్ద రాతి నందివిగ్రహం.. నేల తాకని వేలాడే స్తంభం దేశంలో అత్యంత ఎత్తైనా నాగలింగం. కల్యాణ మండపంలోని సుందర శిల్పాలు, లతా మండపంలోని 96 రేఖాగణిత చిత్ర కల్పనలు వంటి వాటిని ఛాయచిత్రాలతో సహా తన ప్రాథమిక నివేదికలో పొందుపరిచినట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందించి లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావాడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

# పాలిటెక్నిక్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**విశాలాంధ్ర-కదిరి:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎం.నారాయణ తెలిపారు.గురువారం ఆయన కళాశాల లో మాట్లాడుతూ ఈ నెల 12 నుండి ఏప్రిల్ 15లోపు ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన వారు ఫీజు రూ. 100, ఓసి బిసి వారు రూ.400 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 1నుండి 28వరకు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో పాటు మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

# ఆగి ఉన్న స్కూటర్‌ను ఢీ కొట్టిన కేఎస్ ఆర్టీసీ బస్సు

**విశాలాంధ్ర-మడకశిర :** కెఎస్ఆర్‌టిసి బస్సులు మాత్రం మడకశిర వాసుల పాలిట యమ పాషాలుగా తయారవుతున్నాయి. ప్రతి నెలలో కెఎస్ ఆర్‌టిసి బస్సులు ఏదో ఒక వాహనాన్ని ఢీకొంటున్న సంఘటనలు మడకశిరలో తరచుగా జరుగుతుంటాయి. దీంతో కెఎస్ ఆర్‌టిసి బస్సులు ఎదురుపడితే చాలు ఎదురుగా వస్తున్న వాహనదారులు భయంతో బెంబేలెత్తిపోతున్నారు. కొడగారిగుట్ట గ్రామానికి చెందిన సన్న లింగప్ప గురువారం తన కుమారుడికి కుమార్తెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మడకశిరలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకునడానికి వెళుతుండగా వెటర్నరీ కాలేజ్ దగ్గర బండి ఆపి పిల్లలకు చెరుకు రసం తాగించారు. ఇంతలో బెంగళూరు నుండి పావుగడకు వెళుతున్న కెఎస్ ఆర్‌టిసి ఆగి ఉన్న బైకును ఢీకొట్టింది. దీంతో పవన్ (10), ప్రార్ధన(2) తీవ్ర గాయాలయ్యాయి .ప్రమాదం లో ప్రార్థన కాలు నుజ్జునుజ్జు అవ్వడంతో నొప్పిని భరించలేక చిన్నారి కేకలు పెడుతుండడం చూసి స్థానికులు కన్నీటిపర్వంత మయ్యారు.

# 6 వ తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర - అగళి :** స్థానిక ఆదర్శ పాఠశాలలో 6 వతరగతిలో ప్రవేశానికి 100 సీట్లు ఉన్నాయని ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. మోడల్ స్కూల్ ప్రస్తుతం ప్రధానమంత్రి సూర్యోదయ స్కూల్ (పీఎంశ్రీ) స్కూల్ గా మార్పు చేసారని 6 వతరగతిలో 100 సీట్లు వున్నాయని కాని ఇప్పటి వరకు కేవలం 35 మంది దరఖాస్తు చేసారన్నారు. ఆన్ లైన్ అప్లై చేసుకోవడానికి ఈనెల 31 వరకు సమయం ఉందన్నారు.స్థానిక ఎం ఆర్ సి లో లావణ్య ప్రవేశానికి ఆన్లైన్ చేస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 20న ఎం ఇ ఓ.,ప్రిన్సిపాల్ సమక్షంలో పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా 6 వ తరగతి లోకి తీసుకుంటారు. మోడల్ స్కూల్‌లో ఉచిత కోచింగ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేసారు.

# ఫైబర్ నెట్ ప్రసారాల్లో అంతరాయం ఉండొద్దు

**విశాలాంధ్ర-హిందూపురం :** పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో హెచ్సీఏ ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ ఆపరేటర్స్ గురువారం పత్రిక సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు గంటల కొద్దీ సిగ్నల్స్ రాకుండా ఉండడం వల్ల, మా తప్పు లేకున్ననూ కస్టమర్లు మమ్మల్ని వివిధ రకాలుగా నిందిస్తున్నారని, ప్రతి ఒక్కరికి ఇంటర్నెట్ తక్కువ ధరకు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ప్రసారాల్లో జరిగే అంతరాయాలు తూట్లు పొడుస్తున్నాయని అన్నారు. ఓపీ జి డబ్ల్యు ద్వారా ప్రసారాలు తిరిగి ప్రారంభం అవడానికి చర్యలు తీసుకుని నిరంతరాయ సేవలందించాలని కోరారు. చెడి పోయిన ఏపీ ఫైబర్నెట్ బాక్సులు రిపేరు చేయడానికి ప్రతి జిల్లా కేంద్రంలో సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, చెడిపోయిన బాక్సులు, రీఛార్జ్ చేసుకొని బాక్సులకు నెల, నెల 59 రూపాయలు ఛార్జ్ చేస్తున్న దాన్ని తీసివేసి అదనపు భారాన్ని తగ్గించాలన్నారు. హెచ్ సి ఏ, ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ టీవీ ఆపరేటర్స్ హెచ్సీఏ ప్రెసిడెంట్ టీఎన్. వంకటేసులు, ఖలీల్, శంకర్ లాల్, గోపాల్, అశోక్, మోహన్, టెక్నీషియన్ శివ, మోతుగాక పల్లి శంకరప్ప, మహేష్, ఇర్ఫాన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి ఎద్దడి

**విశాలాంధ్ర-గుడిబండ:** మండలంలోని సీసీ గిరి ఎస్సీ కాలనీ మహిళలు తాగునీటి కోసం రోడ్డుపై ఏపీఎస్ఆర్టీసీ బస్సుకు అడ్డంగా ధర్నా నిర్వహించారు. త్వరితగతిన తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ధర్నాను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో సి.సి.గిరి ఎస్సీ మహిళలు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాగునీటి కోసం రైతుల బోరుబావులు ఆశ్రయిస్తూ నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు వాపోయారు.విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ ఈఓఆర్డి నాగరాజు నాయక్ సి.సి.గిరి గ్రామాన్ని చేరుకొని ఎస్సీ కాలానికి సంబంధించిన బోరు బావిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి అలాగే బోరుబావికి పంప్ సెట్ కూడా ఉందని కేవలం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం ఉంటుందని మహిళలకు వివరించారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేవరకు తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీళ్లు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఏపీఎస్ఆర్టీసీ బస్సుకు అడ్డంగా ఉన్న మహిళలు శాంతించారు. విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ప్రత్యేక చొరవ తీసుకొని జమ్మలబండ, శంకర గల్లు, సిసిగిరి గ్రామాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 14, మార్చి 2025

## భూమి సేకరణకు రైతులు సహకరించాలి

### భూ నష్టపరిహారం తప్పనిసరిగా అందిస్తాం
### పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ

**విశాలాంధ్ర - గోరంట్ల :** గోరంట్ల మండలంలోని గౌని వారి పల్లి వద్ద గల ఎస్ హెచ్ 716 జి నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల కోసం అదనపు భూసేకరణ కొరకు రైతులు సహకరించాలని పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ పరపతి పోరారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలంలోని గౌని వారి పల్లి గ్రామంలో రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసి 3.64 ఎకరముల భూమిని సేకరించడం జరుగుతుందని సంబంధిత రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు ఎవరు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని రైతులు భూసేకరణకు సంబంధించిన వివరాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు రెవిన్యూ సిబ్బంది సర్వేయర్లు ప్రజలు పాల్గొన్నారు.

## మూత్రపిండాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

**విశాలాంధ్ర - ధర్మవరం :** ప్రతి వ్యక్తి మూత్రపిండాల (కిడ్నీ) విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకొని చక్కటి ఆరోగ్యం పొందాలని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులు డాక్టర్ సంకారపు నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోతుకుంట రోడ్డులో గల నూతన ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్లో ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా సందర్శించారు. వీరి వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి కూడా ఉన్నారు. అనంతరం అక్కడ డయాలసిస్ జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ డయాలసిస్ కేంద్రంలో 22 మంది డయాలసిస్ చికిత్స పొందుతున్న రోగులను వారు ఆరోగ్య విషయంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ బిపి షుగర్ వ్యాధిగ్రస్తులకే మూత్రపిండాల వ్యాధి అధికంగా వస్తుందని, ఈ రోగులకు రక్తనాళాలు దెబ్బ దెబ్బతిని మూత్రపిండాల ద్వారా వడపోత చేసిన తర్వాత శక్తిని తగ్గిస్తాయని తెలిపారు. మలినాలు రక్తములో ఉండటం వలన మూత్రపిండాలు పనిచేయవు అని తెలిపారు. వ్యాధి బాధితులు సక్రమ వైద్య చికిత్స అందుకొని అదుపులో ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. ధర్మవరంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి డయాలసిస్ కేంద్రాన్ని నియోజకవర్గ ప్రజలకు ధర్మారం ఎమ్మెల్యే, ఆరోగ్య వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఏర్పాటు చేయడం హర్షనీయమని, ప్రజలు కూడా ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు కాళ్లు ఒళ్ళు నొప్పులు ఉన్నప్పుడు అధికంగా మాత్రలను వాడరాదని, అలా వాడినప్పుడే కిడ్నీలు దెబ్బ తినే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా సిగరెట్టు త్రాగడం కూడా కిడ్నీ దెబ్బ తినే అవకాశం ఉంటుందని తెలిపారు. మానవ శరీరంలో కిడ్నీ అనేది ఒక ముఖ్యమైన భాగము అని తెలిపారు. మానవ శరీరంలో ఉత్పన్నమైన మలినాలను రక్తము ద్వారా మూత్రపిండంలోకి చేరి వడగట్టపడుతుంది తదుపరి బయటికి వేరే రూపంలో పంపబడుతుందని తెలిపారు. తద్వారా రక్తం శుభ్రపడుతుందని తెలిపారు. కిడ్నీ పని విధానం సరిగా లేకపోతే వివిధ అనారోగ్యాలు వస్తాయి అని తెలిపారు. కిడ్నీలు దెబ్బతిన్నప్పుడు నీరసము, బలహీనము, శరీరం ఉబ్బడం లాంటివి కిడ్నీ వ్యాధి లక్షణాలు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుపై మురికి నీరు..!

### పట్టించుకోని పంచాయతీ సిబ్బంది

**విశాలాంధ్ర-తలుపుల:** స్థానిక మేజర్ పంచాయతీకి కూత వేట దూరంలో ఉన్న ప్రధాన రహదారి పైన చుట్టుపక్కల వారు రోడ్డు పైన మురికి నీరు ఇష్టానుసారంగా వేయడంతో పంచాయతీ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు మురికి నీరు దొర్లుతున్నాయి. పాదాచార్యులు ద్విచక్ర ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని స్థానికంగా ఉన్న ప్రజలు మండిపడుతున్నారు. ఎప్పుడు ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరుగుతాయో ప్రజలు భయపడుతున్నారు ఇక ప్రజలకు సంబంధించిన షాపులు ఉండగా వారి వివిధ పనుల నిమిత్తం కొరకు వచ్చిన ప్రజలు వస్తుంటారు అక్కడ నీరు నిలువ ఉండడంతో ఇలా మురికి నీరు రోడ్ల పైన ఉంటే రోగాలు దరిచేరమని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నీరు వేస్తున్న వారిని గుర్తించి నోటీసులు అందజేసి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

## ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలి

**విశాలాంధ్ర-ఉరవకొండ :** పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఉరవకొండ మండల నాయకులు తెలిపారు. విజయవాడ లో ఈనెల 15వ తేదీన జరిగే నిరసన దీక్షలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఉరవకొండలో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఉరవకొండ మండల అధ్యక్షుడు నందు మాట్లాడుతూ 5వేల కోట్లు ఫీజు రీయింబర్స్ బకాయిలను చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చి ఇప్పటివరకు స్పందించక పోవడం దారుణమని అన్నారు. కళాశాలకు విద్యార్థులను ఫీజుల కోసం వత్తిడి చేస్తున్నాయని, అప్పు చేసి ఫీజులు కట్టవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ విద్యారంగ సమస్యలపై ఈనెల 15 తేదీన జరిగే నిరసన దీక్షలో విద్యార్థులు పెద్దయెత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మండల నాయకులు తరుణ్, ఎర్రి స్వామి, భాస్కర్, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలకు పరిశ్రమకు మాత్రమే ఉపయోగించాలి

**విశాలాంధ్ర-ధర్మవరం:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ను విశాఖ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలకు పరిశ్రమ నడపడానికి మాత్రమే ఖర్చు పెట్టాలని సిఐటియు మండల కన్వీనర్ జే వి రమణ, కోకన్వీనర్ అయ్యుప్ఖాన్, పెద్దన్న, మారుతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కేటాయించిన బడ్జెట్ కేవలం గతంలో కాంట్రాక్టులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కోసం మాత్రమే కేటాయించాలని తెలిపారు ఫ్యాక్టరీలో కష్టపడుతున్న కార్మికుల వేతనాలు తప్పనిసరిగా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి మేము విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం బడ్జెట్ కేటాయించామని చెప్పడం, కార్మికులను పరిశ్రమను నట్టేట ముంచడమే నని వారు మండిపడ్డారు. శుక్రవారం కార్మికులను ప్రజలను కలుపుకొని నిరసన కార్యక్రమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**విశాలాంధ్ర - గోరంట్ల :** గోరంట్ల మండలంలోని కరావులపల్లి తండాలో విద్యుత్ షాక్ తో మహిళ మృతి చెందినట్లు సిఐ బోయ శేఖర్ తెలిపారు. సంపులోని నీటిని మోటార్ ద్వారా తోడటానికి మోటార్ ను ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కే.తిప్పి బాయి(49)అను మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## కుట్టు శిక్షణ కేంద్రానికి దరఖాస్తు చేసుకోండి

**విశాలాంధ్ర-పెనుకొండ:** పట్టణంలోని తెదేపా కార్యాలయంలో టిడిపి నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు సమావేశమై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ సూచనల మేరకు బీసీ సంక్షేమ శాఖ ప్రకటించిన విధంగా కుట్టు మిషన్లు ట్రైనింగ్ ప్రోగ్రాం, ఉచిత కుట్టు మిషన్లు కొరకు దరఖాస్తుదారులను సంబంధిత సచివాలయాల్లో వెల్ఫేర్ ఆఫీసర్ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దగ్గర నమోదు చేసుకోవాలని ఇందుకు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ పత్రము, బిసి సర్టిఫికెట్స్ నమోదు చేసి బీసీలు ఆర్థికంగా వెనుకబడిన ఓసీలు, ఈ కుట్టు మిషన్ల ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ట్రైనింగ్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకునేకి వెసులుబాటు ఉందని ఈ అవకాశాల్ని సద్వినియోగం పరుచుకునే విధంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు నాగులూరు నారాయణస్వామి రమణమ్మ, గార్మెంట్స్ రవి, సిద్దయ్య శ్రీనివాసులు గుట్టూరు సూర్యనారాయణ, హనుమంతు,త్రివేంద్ర బాబుల్ రెడ్డి కురుబ నంజుండ బాబిరెడ్డి కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం పులుగుర శ్రీనివాసులు లక్ష్మీదేవమ్మ సోము చెంద్రాయుడు చంద్రకాంతమ్మ నారాయణ నాయక్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 23న సింహగర్జనను విజయవంతం చేయాలి

**విశాలాంధ్ర-ఉరవకొండ :** ఈనెల 23న తిరుపతిలో జరిగే రాయలసీమ మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఉరవకొండ పట్టణంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలక బాల రామాంజనేయులు ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాల రామాంజనేయులు మాట్లాడుతూ మాలల అస్తిత్వం, ఆత్మ గౌరవం కోసం మాలలను ఐక్యం చేయడం కోసం మాలల సింహ గర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నమన్నారు. మాలలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఖండిస్తూ మాల మహానాడు ఉద్యమించక తప్పదన్నారు .ఈ సభ ఎవరికీ వ్యతిరేకం కాదని, మాల జాతి జాగృతం కోసమే నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సీనియర్ జర్నలిస్టు రాజ్ కుమార్, రాజు పాల్గొన్నారు.

# నష్టపరిహారం అందించాం

**మూడు నెలలు కావస్తోంది... రోడ్డు పనులకు ఆటంకం చేయరాదు.**
**ఇల్లు ఖాళీ చేయాల్సిందే..**
**ఆర్డీవో సువర్ణ సూచనలతో ఇళ్ళు ఖాళీ..**

**విశాలాంధ్ర - గోరంట్ల :** ముదిగుబ్బ కోడూరు 342 నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులలో భాగంగా బూదిలి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇప్పటికే ఇల్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అందించామని అయితే నెల గడువు కూడా ఇవ్వడం జరిగిందని మూ డు నెలలు కావస్తున్నా లబ్ధిదారులు ఇలా రోడ్డు పనుల ను ఆటం కలిగించరాదని పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ రెవెన్యూ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని దళితులతో చర్చించారు. తప్పనిసరిగా నష్టపరిహారం తీసుకున్న తర్వాత కొన్ని రోజులలోనే ఖాళీ చేయాల్సి ఉందని అయితే మూడు నెలలకు పైగా కాలయాపన చేశారని వెంటనే చేయాలని సూచించారు. జెసిబి ద్వారా ఆర్డిఓ సూచనలతో నేషనల్ హైవే డిఈఈ పనులను ప్రారంభించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగ కుండా సీఐ బోయ శేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సహాపుగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

# అగ్నికి ఆహుతి అవుతున్న అడవులు

**విశాలాంధ్ర-నంబులపూలకుంట :** వేసవి కాలం వస్తే చాలు అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. గుర్తు తెలియని అగంతకులు, వాహనదా రులు సిగరెట్, బీడీ తాగుతూ ఆర్పివేయకుండా పడేయడంతో, మరి కొందరు అదే పనిగా అడవులకు నిప్పు పెట్టడం వంటివి కొనసాగు తున్నాయి. అటవీ జంతు సంపద, పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల పరిధిలోని బందారు చెట్లపల్లి వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గుట్టలకు అగ్గి పెట్టడంతో పంటలు సాగు చేసుకుం టున్న రైతులు తమ పంట వద్దకు అగ్గి వస్తుందని వాటిని ఆర్పడానికి నన అగచాట్లు పడ్డారు. అదేవిధంగా గురువారం ఉదయం 9గంటల సమయంలో మర్రికొమ్మదిన్నె గ్రామ సమీపంలో గుట్టకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగసిపడి సమీపంలోని అడవి కాలిపోయింది. గతంలో అటవీశాఖ అధికారులు అడవుల ఉపయోగాలు గురించి గ్రామాల్లో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అటవీ అధికారులు వేసవి కాలంలో నైనా గ్రామాల వైపు వెళ్లి గ్రామస్తులతో సమావేశమై అడవుల వలన కలిగే ప్రయోజనాలను, అడవులకు నిప్పు పెట్టడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

## మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

**విశాలాంధ్ర-శింగనమల :** మహిళలు మహిళలు పోషక పదార్థాలను బాగా తీసుకోవాలని, వెజిటబుల్ ఆకుకూరలు పండ్లు పాలు కూరగాయలు 50 శాతం తప్పనిసరిగా ఉండాలని,ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఐటీసీ వారి సహకారంతో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం లో భాగంగా పోషణ మేళా ప్రోగ్రాం సలకం చెరువు గ్రామంలో ఐ జి డి జిల్లా కోఆర్డినేటర్ దర్గయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ మేళాలకు 450 మంది మహిలలు, పురుషులు, పిల్లలు పాల్గొని, ఎత్తు, బరువు కొలతలు చెక్ చేసుకుని, ఆటల ద్వారా బహుమతులు అందుకున్నారని, పౌష్టిక ఆహారం గురించి క్విజ్ ఏర్పాటు చేశామని గెలిచి నవారికి బహుమతులు, న్యూట్రిషన్ కిట్స్ అందించామన్నారు. గర్భిణీ స్రీలు, బాలింతలు, ఎదిగే పిల్లలు సూక్ష్మ పోష్టికహారం బాగా తీసుకోవాలని సూచించారు,రక్త హీనత వారు అయోడిన్ వాడకం వలన ఎంతో ఉపయోగం ఉందని, పిల్లలకు తెలివి పెరిగి,అంగ వైకల్యం రాకుండా ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో ఐ జి డి స్టాఫ్ సుదర్శన్ రెడ్డి, మహమ్మద్, పోతులయ్య, రహేన, రమణమ్మ, సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి ఏఎన్ఎం అలివేలమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌసల్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కురుబ సంఘం డైరెక్టర్ కరేగౌడ్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. గురువారం రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంజనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు, రాష్ట్ర కురువ సంఘం డైరెక్టర్ మంజునాథ్ గౌడ్ఆధ్వర్యంలో పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవానికి భారీగా జనసైనికులు తరలి వెళ్లారు. పార్టీ అధినేత జనసేన అధ్యక్షుడు పేద ప్రజల సంక్షేమం అభ్యున్నతికి ఎనలేని కృషిచేసి సినీ రంగంలోనే కాకుండా ప్రజాసేవ రంగంలో కూడా తన బాధ్యత వహిస్తున్నట్లు మంజునాథ మీడియాతో వెల్లడించారు. రాష్ట్ర కురువ సామాజిక వర్గానికి తన వంతు బాధ్యతగా ఇచ్చిన పదవీ బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు. 12వ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు తరలివస్తున్నట్లు ఆయన వివరించారు. నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో అనేక అభివృద్ధి సంక్షేమ పార్టీ ప్రచారాల్లో కూటమి ప్రభుత్వంతో పనిచేసినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో తనకిచ్చిన బాధ్యతను నెరవేరుస్తానని పేర్కొన్నారు.

## ఘనంగా ఉద్యోగ విజయోత్సవాలు

**విశాలాంధ్ర-ఉరవకొండ :** ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం కళాశాల ఉద్యోగ విజయోత్సవాల ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆస్రాఫ్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు, డైరెక్టర్ ఆఫ్ ఎవాలేషన్, జేఎన్టీయూ అనంతపురం , విశిష్ట అతిథిగా ఎం సాలెప్ప ఉరవకొండ ఎస్డి ఈ బిఎస్ఎన్ఎల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల చెందిన 15 మంది ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యార్థులు రాయల్ ఎన్ఫీల్డ్ చెన్నై వారు ఉద్యోగాలకు ఎంపికైనట్లే తెలిపారు.ఒక సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి పర్ఫెక్ట్ సర్వేయర్ లిమిటెడ్ చెన్నైకు ఉద్యోగానికి ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ అధికారి అలీ ఆఫ్ హుస్సేన్ ట్రిబుల్ ఈ శాకాధిప తులు వై.సురేష్ బాబు, నరసింహారెడ్డి, డాక్టర్ సులోచన ,మాట్లాడుతూ దీర్ఘకాల లక్ష్యముతో పరిశ్రమలో సాంకేతిక పరిజ్ఞానంతో పని చేయాలని జాతికి ఉపయోగపడే ఆవిష్కరణలకు మగ్గుచూపాలని ఉద్బోధించారు.

## హోలి మహోత్సవానికి బయలుదేరిన బంజారాలు

**విశాలాంధ్ర - ఉరవకొండ :** సింధు నాగరికత నుంచి సనాతన హిందూ సాంప్రదాయం ప్రకారం అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించుకునే హెూలీ మహెూత్సవానికి కర్ణాటక రాష్ట్రం కోప్పల తాలూకా గ్రామానికి అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం రూపా నాయక్ తండా కు చెందిన బంజారాలు గురువారం బయలుదేరి వెళ్లారు ఈ సందర్భంగా సంగరేర్ నాయక్, డావో, కార్భారీ, సంగార్జీ, గేరియా నేతృత్వంలో బయలుదేరారు. ఈ సందర్భంగా బంజారా సంఘం ప్రతినిధి ఎస్కే కేశవ నాయక్ మాట్లాడుతూ కర్ణాటకలో జరిగే హెూలీ మహెూత్సవానికి రూపా నాయక్ తండ వాసులకు ప్రత్యేక ఆహ్వానించారని తెలిపారు. బంజారా లు జరుపుకొని హెూలీ మాత చరిత్ర గేర్ ఫాగ్ వాలణ లేంగి తదితర కార్యక్రమాల గురించి కర్ణాటక వాసులకు రూపా నాయక్ తండవాసులు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం ప్రతినిధులు ఎస్కే సుబ్రహ్మణ్యం నాయక్, రమావత్ లక్క నాయక్, వి నర్సింగ్ నాయక్, మాజీ జెడ్పిటిసి తులసీదాస్ నాయక్, పి వాల్య నాయక్, రమావత్ దేవ్లా నాయక్, కె రమేష్ నాయక్, ఆర్ వి రూపా నాయక్, ఎం దాసు నాయక్, డి శీనా నాయక్, ఆర్ దాఖ్యా నాయక్, ఎం రామదాస్ నాయక్, ఎస్ లక్ష్మ నాయక్, జి సోమ్లా నాయక్, ఆర్ ధర్మానాయక్. తదితరులు కర్ణాటక తరలి వెళ్లారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహుడు కల్యాణోత్సవ వేడుక

**విశాలాంధ్ర - ఆత్మకూరు :** మండల పరిధిలోని పంపనూరు సమీపాను కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం కళ్యాణోత్సవ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపంపల్లికి చెందిన విశ్రాంత ఎంఈఓ వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సమీప పల్లెలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు కళ్యాణోత్సవం తిలకించడానికి కొండకు తరలివచ్చారు. ప్రతి ఏటా ఫాల్గుణ చతుర్దశి నాడు స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం ఉదయం మడుగుతేరు సాయంకాలం రథోత్సవం నిర్వహించనున్నారు. కొండ క్రింది భాగంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చిరు వ్యాపారులు అంగళ్లు ఏర్పాటు చేసుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

## ఆలయంలో ఎమ్మెల్యే జేసి ప్రత్యేక పూజలు

**విశాలాంధ్ర - యాడికి :** మండల కేంద్రంలోని శుక్రవారం జరగబోవు రథోత్సవానికి సంబంధించిన పనులను పర్యవేక్షించి, ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులను తాడపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి గురువారం అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఆలయ వేద పండితులు దేవాదాయశాఖ అధికారులు, శాసనసభ్యులు అష్మిత్ రెడ్డి స్వాగతం పలికారు. తాడిపత్రి శాసనసభ్యులు జె.సి. అష్మిత్ రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ అర్చకులు జె.సి. అష్మిత్ రెడ్డి , మాతృమూర్తికి ఆలయ విశిష్టత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, మండల తెలుగుదేశం నాయకులు, జెసి అభిమానులు, స్వామివారి భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సిబ్బందికి శిక్షణ తరగతులు

**విశాలాంధ్ర-యాడికి :** కడపలో జోనల్ మలేరియా ఆఫీస్ నందు ఒకరోజు ట్రెనింగ్ ప్రోగ్రామ్ నందు జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ ఆదేశాల మేరకు ప్రతి ఒక సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రతిరోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ల్యాబ్‌లను పరీక్షించి అక్కడ రికార్డ్స్ ఎలా ఉన్నవి ఎక్విప్మెంట్ ఎలా ఉన్నది అవి సరిగా లేనిచో అక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌కు ఎం వన్ నుంచి ఎం8 రికార్డులను కచ్చితంగా తనిఖీ చేసి వాటి ఆవశ్యకత గురించి తెలియజేయమని తెలిపినారు. అందులో భాగంగానే గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుక్కలూరు లోని ల్యాబ్ ను మరియు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సూపర్వైజర్ ఎంపి నారాయణ ఫిమేల్ సూపర్వైజర్ హేమలత ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతి సంజీవ కృష్ణ పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతునిగా ఎదగాలి

**విశాలాంధ్ర-ఓడిసి రూరల్ :** ప్రతి విద్యార్థి ఇప్పటినుండే ఉన్నత విద్యపై దృష్టి సారించి చదివితే మంచి భవిష్యత్తు అందుకోగలుగుతారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పేర్కొన్నారు, గురువారం తంగేడు కుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ కార్యక్రమాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకోవడం జరిగింది, ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి పాఠశాల గుర్తింపును గౌరవాన్ని నిలబెట్టాలని సూచించారు, పలువురు విద్యార్థులు స్పందిస్తూ మండలంలోని ఈ స్కూలును మొదటి స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రమణయ్య ఉపాధ్యాయులు తిరుపాలు చంద్రకళ సుధాకర్ జనార్ధన్ లక్ష్మీదేవి జయప్రకాష్ శివశంకర్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీని పరామర్శించిన బొంబాయి

**విశాలాంధ్ర-యాడికి :** మండల కేంద్రంలో గత వారం రోజుల క్రితం మాజీ ఎంపిటిసి అది రాత్రి వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి బైక్ తగిలి కాలికి తీవ్ర గాయం కావడంతో అనంతపురం హాస్పిటల్‌లో చికిత్స చేయించుకొని స్వగృహం చేరుకొన్న అదిని విషయం తెలుసుకొన్న వైసీపీ సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు ఉపసర్పంచ్ సర్పంచ్ కాసా చంద్రమోహన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్ వార్డ్ సభ్యులు గుంత తిరుపతి, మేకల రామచంద్ర, గజ్జి బాల పెద్దయ్య, మలపాటి సతీష్ నాయుడు,చిట్టెం రెడ్డి బాల రెడ్డి, కోట చౌదరి,గుర్రాల రాముడు, శివయ్య, కిట్టు, చళ్ళు, దూద్ వలి, చాంద్ బాషా, పెద్ది రాజు,ఫరూక్, ప్రెస్ శీనా,పాల రంగ, శ్రీరంగా తదితరులు పాల్గొన్నారు.

## 11వార్షికోత్సవంలో పూజలు అన్నదానం

**విశాలాంధ్ర-పెనుకొండ:** పెనుకొండ హెచ్ఎంటి కాలనీలో ఉన్నటువంటి శ్రీ షిరిడి సాయి , శ్రీ సత్య సాయి భజన మందిరము ఏర్పాటు చేసి 11 వసంతములు పూర్తి అయినది, 11వ వార్షికోత్సవ మహెూత్సవం గురువారం నిర్వహించారు, నగర సంకీర్తన పురవీధులలో జరిగినది. ఘనపాటి ప్రసాద్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం అర్చన మహా మంగళ హారతి జరిగినది, తీర్థ ప్రసాదములు, మహా నారాయణ సేవ 300 మందికి అన్నదానం చేశారు.సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. అనేకమంది భక్తాదులు స్వామి వారి యొక్క దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినారు. ఈ కార్యక్రమమునకు సహకరించిన వారికి, సేవలో పాల్గొన్న వారికి అందరికీ శిరిడి సాయి,భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు కలిగి ఉండాలని కోరుకుంటున్నామని సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.